# జరుగుతున్న కథే!

ఎమ్.వి.వి. సత్యనారాయణ.

"తాగి తాగి తాగి ధరణిపై పడుదాక. . ."

"దండాలు, ఊరబద్దరయ్య గోరూ!"

వీరభద్రయ్య పుస్తకంలోంచి తలెత్తి చూశాడు. ఫకీరు. అరుగు క్రింద వాకిట్లో నిలబడ్డాడు. పుస్తకంలో లీనమై చాలసేపటి నుండి ఉండిపోవడంతో వీరభద్రయ్యకు చప్పున మాట రాలేదు.



"ఏమన సెతకమా, యీరబద్దరయ్యగోరూ!" అన్నాడు ఫకీరు.

"అవును" అన్నాడు వీరభద్రయ్య.

"పద్దేలంటే అవే పద్దే లయ్యగోరూ! మన నోట్నొంచి వూడిపడ్డట్టు ..."

"ఏం లాభం, ఫకీరూ! వాటిని మనం చదువుకుని ఆనందపడుతున్నాం. అంతే! ఆ మంచి మాటలు బుర్రకు పట్టించుకోం."

ఫకీరు అనుమానంగా చూచి, "నన్ను గురించేనా, అయ్యగోరూ!" అన్నాడు.

"అవును, ఫకీరూ! నీ సంపాదన అంతా నువ్వే తాగేస్తే కుటుంబం ఎలా నడవాలి చెప్పు?"

"అదేం టయ్యగోరూ! రోజు కష్టం ... ఒళ్ళంతా యిరగొట్టినట్టు... రెండు గలాసులు యేసుకుంటే... అసలు యేసుకోకపోతే ఎలా, అయ్యగోరూ! సలుపులు ఎలా తీయాల?"

"నీ కష్టం గురించే నువు ఆలోచిస్తున్నావు కాని సీతాలు ఎన్ని యాతనలు పడి కుటుంబాన్ని లాక్కొంటూ వస్తోందో తెలుసా?"

"ఆడదయిన తర్వాత ... ఏంటండయ్యగోరూ ... మీకు సెప్పేపాటి యివరమా..." ఫకీరు తూలాడు నిలదొక్కుకున్నాడు.

వీరభద్రయ్య పళ్ళు బిగించాడు. ఫకీరుకు నిషా ఎక్కుతోంది. రోడ్డు మీద తాజాగా వెలసిన ప్రభుత్వ సారా దుకాణంలో కడుపు నిండా పట్టించి ఉంటాడు.

"వెళ్ళిరా, ఫకీరూ!" అన్నాడు వీరభద్రయ్య.

ఫకీరు చేతులెత్తి దండం పెట్టాడు. మెల్లగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటివైపు కదిలాడు.

"వొచ్చావా... కాస్త నోరు మూసుకుని ఉండు" అంది సీతాలు.

"ఏంటే ... నీయవ్వ ..." ఫకీరు అదుపు తప్పబోయాడు. సీతాలు చప్పున అతడి నోటికి తన చేతిని అడ్డం పెట్టింది. "అల్లుడొచ్చాడు" అంది.

"వొస్తే ... ఏంటే ..."

"అమ్మాయిని తీసుకొచ్చాడు."

"వో ... పండగకా?" ఫకీరు తూగుతూ గోడకు జారగిలపడ్డాడు.

"పండగా కాదూ ... నా దినం ... అల్లుడికి కట్నం సొమ్మిచ్చావా?"

"ఇచ్చినంత ఇచ్చినం, ఇత్తాం కదా!"

"అదే ఎప్పుడు ... ఆ యివరానికే వొచ్చేడు."

"ఏంటే ... ఆ మాత్తరానికే సూరీడుతో రావాలా?"

"ఇప్పటికి వూరుకో ... రేపు పొద్దు ఏం సెప్పుకుంటావో సూసుకో."

ఫకీరు అప్పటికే మగతలోకి జారుకున్నాడు. ఉదయాన్నే అల్లుడే ఫకీరును కదిపాడు.

"మామయ్యా! కట్నం డబ్బు ఎప్పుడిస్తావు?" అన్నాడు రాజు.

ఫకీరు ఇబ్బందిగా మొహం పెట్టాడు—"ఇత్తానల్లుడూ! డబ్బు దొరకద్దా?" అన్నాడు.

"అదే ... డబ్బు ఎప్పటికి దొరుకుద్ది?"

"ఎప్పటికంటే ... పెయత్నం సేస్తన్నంగందా!"

"అదే—ఎంతకాలం పడుద్దో చెప్పు... చాలు."

"రెండ్నెల్లు."

రాజు ఆ మాత్రం గడువు ఇచ్చినట్టుగా తలూపాడు. "అంతవరకూ సూరీడు ఇక్కడే ఉంటుంది. మా అమ్మ చెప్పుతుంది."

ఫకీరుకు నిస్సహాయత కోపంగా మారింది. "అంటే ... కట్నం సొమ్ము ఎంతకాలం ఇయ్యకపోతే ... అంతకాలం ... సూరీడు ఇక్కడే ఉంటదా?"

"అవును. అలాగే చెప్పమంది మా అమ్మ."

"రాజూ! ఇదన్నాయం."

"ఏది అన్యాయం, మామయ్యా! నువు ఇస్తానన్న టైము దాటి రెండేళ్ళయింది. నాకు చూస్తే వ్యాపారం రాణింపు లేదు. మా బతుకు ఎలా గడవాలి? డబ్బు లేకుండా ఏమవుద్ది?"

"నీ యెవ్వారం రెండు యెయ్యిలతో ముడి పడిపోనాదా?"

"అవును."

"అల్లుడూ ... అమ్మాయిని తీసుకెల్లు. డబ్బు సదురుతాన్లే.."

రాజు నిర్లక్ష్యంగా తలెగరేసి లేచాడు. చెప్పవలసింది ఇక ఏమీ లేదన్నట్టుగా గుమ్మం దాటాడు.

"అబ్బాయిని ఎంగిలి పడమనే ... అలా సూస్తవేం?" అంది సీతాలు.

సూరీడు బిక్కమొగం పెట్టి, "నే నడ్గం ఎల్లు. నన్ను తన్ని ముక్కలు సేస్తడు. ఎల్లనీ ... ఒటేలులోనో తింటడులే" అంది.

రాజు వాకిట్లో ఆగాడు.

"ఏవే! సూరీడూ! రెండువేలూ. తీసుకువచ్చాకనే నిన్ను ఏలుకుంటాను. ఈ లోపులో వచ్చావా—కైమా అవుతావు" అన్నాడు రాజు.

ఫకీరు మూతి బిగించి చూడసాగాడు. సీతాలు కూతురిని సమీపించింది. ఆమె తల మీద చెయ్యి ఉంచి నిమిరింది. రాజును వెళ్ళనిచ్చి ఫకీరు తిట్లు లంకించుకున్నాడు.

"మొగుడు తీసుకొచ్చి ఒగ్గేత్తే ఉండిపోవడమేనా?" అన్నాడు కూతురును.

"అల్లుడోడికి సమర్ధించుకొని సెప్పుకోవద్దా" అన్నాడు పెళ్ళాన్ని.

"ఆడకూతురి మీది డబ్బుకు ఆస పడ్డాడూ—ఆడేటి మగోడు?" అన్నాడు అల్లుడిని.

తర్వాత సుష్టుగా గంజి అన్నం తిని పనిలోకి వెళ్ళాడు. వారాలు గడుస్తున్నాయి. కాని ఫకీరు కట్నం డబ్బు సంపాదించే ప్రయత్నాలేమీ చేయడం లేదు. ఒక రోజు సీతాలు అడిగింది

"సూరీడును అత్తింటికి పంపవా?"

"ఏటి సూసి పంపమంటవే!" అన్నాడు ఫకీరు.

"అదేటి మాట—పెళ్ళి పందిట్లో మాటెందుకొగ్గావు?"

"ఒగ్గకపోతే పెళ్ళవుద్దా?"

"అందుకేగదా అల్లుడు మాటట్టుక్కూసున్నాడు."

"కూసుండనీయ్! సూరీడు మనకి బరువా?"

"మరయితే పెళ్ళెందుకు సేసినవు?"

"ఏటే నీ ఏదవ గోల?"

"ఏదవని కాదా— నువ్వుండగానే ... ఒక్కసారి యీదిలో కెల్లి ఇను. మన గురించే అనుకుంటున్నరు."

"ఎవడే అనుకునేది?"

"మగాడినేలాగా అనుకుంటారా?"

"అంటే ఆడోళ్ళన్న మాట — అనుకునేది. ఆళ్ళకి పనుల్లేవా?"

తల్లికీ, తండ్రికీ మధ్యకు అడ్డంగా వచ్చింది సూరీడు. ఆ రోజుకు గొడవ సద్దుమణిగింది. ఆ రోజు రాత్రి ఫకీరు కడుపునిండా తాగి వచ్చాడు. అతడు రాత్రి ఇంటికి వచ్చేటప్పటికి తల్లీకూతుళ్ళు కంగారుపడుతున్నారు.

ఫకీరు తిండీ తిప్పలూ లేకుండా మంచానికి అడ్డంగా పడుకున్నాడు. సీతాలు అతడిని మగతలోంచి ఇవతలకు లాగడానికి విశ్వప్రయత్నం చేసింది.

"ఏటే ... ఏటయ్యిందే!" అన్నాడు ఫకీరు ఒక రాత్రి వేళ. "అల్లుడి దగ్గర నుంచి కాయితం వచ్చింది" అంది సీతాలు.

"ఏటా కాయితం?"

"వాళ్ళ అమ్మకి బాగానేదంట. సూరీడును ఎంటనే బయల్దేరి ఎల్లిపొయి రమ్మన్నాడు. యీరబద్దరయ్య చదివి సెప్పారు."

"ఆడిస్టమేనా? పొమ్మండానికీ, రమ్మండానికీ?"

"ఏటా మాటలు? అతడిగాడి తల్లికి బాగు నేదంట."

"ఉస్ ... ఎవడికి సెపతాడే కతలు! సూరీడును కట్నం తేలేదని సంపెయ్డానికేఆడు కబురెట్టాడు"

"నీకు మతోయింది. సూరీడును అల్లుడు పువ్వుల్లో ఎట్టుకుని సూసుకుంటడు. నువు కట్నం డబ్బు ఇయ్యక గానీ...

"అయితే ఎల్లమనే ... అల్లుడి దగ్గర కెల్లమనే ..."

సీతాలు కూతురి వంక చూచింది. సూరీడు తండ్రి మాట కోసమే చూస్తోంది. బట్టలు సర్దుకుంది.

"టిక్కట్ డబ్బులు?" అంది సీతాలు.

"పెట్టె అరలో ఉండాలే" అంది సూరీడు.

సీతాలుకు బాధగా ఉంది. కూతురిని దిగబెట్టి రాకపోతే పోయె. ఆమె అత్తింటికి వెళ్తుంటే చేతిలో పెట్టడానికి కూడా ఏమీ లేదు. ప్రయాణం ఖర్చులు కూడా కూతురి దగ్గరే దండేస్తున్నాడు తండ్రి.

సూరీడు పెట్టె వెదికింది. బట్టలు తిరగబెట్టింది. ఒకటికి రెండుసార్లు వెదికింది.

"అమ్మా! ఇందులోనే డబ్బు లెట్టానే!" అంది సూరీడు.

"సూడు—ఉంటయే." అంది తల్లి.

ఫకీరు మెల్లగా మంచం మీద లేచి కూర్చున్నాడు. "డబ్బు లెతక్కే సూరీడూ!" అన్నాడు.

"ఏం? నువ్విత్తావా?" అంది సీతాలు.

"నా కాడే ఉందే? దాంట్లో డబ్బులు నేను వాడేసాను."

సీతాలు నిశ్చేష్టురాలయి పోయింది. కూతురికి

ప్రయాణం ఖర్చులు ఇవ్వకపోగా దాని డబ్బులు వాడేశాడు.

"నీ మెడలో సెతమానం ఇయ్యే, సూరీడూ?"

"ఎందుకు... అదొకటి ఉండిపోనాదా?" సీతాలు కంయ్‌మంది.

"కాదే ... ఎర్రిమొగనూ? కోపరేట్ లోన్ తీత్తను!"

"దానికి సెతమానం ఎందుకు?"

"కొంత వోటా డబ్బు కట్టాల. మూడేలిత్తారు· తర్వాత సెతమానం, రెండు ఏలూ సూరీడు కిత్తాం. అల్లుడితో గోలుండదు గందా అని మాత్తన్నను."

సీతాలు మొహంలో చాలకాలం తర్వాత వెలుగు వెలిగింది.

"నిజెంగానా?"

"ఆఁ! ఈ రోజే రమ్మన్నడు. సెతమానం తాకట్టు ఎట్టి డబ్బు కడతాను."

"అల్లుడు రమ్మన్నాడు గందా!"

"ఏంటే ఎర్రిమాటలు! ఆడు రమ్మంటే ఎల్లిపోవడానికీ, వద్దంటే మరి ఉండిపోవడానికీ పానం బికారోళ్ళమా?"

"దాని సెతమానం కూడా ఒట్టుకెల్లి ఏటి సేత్తవో ..."

"కావలత్తే నాకూడా రాయే."

"ఆ మాత్తరం డబ్బులు ఎక్కడా పుట్ట వంటవా నీకు?"

"ఎందుకు పుట్టవు? మనింట్లో బంగారం ఎట్టుకుని ఎవడినో కాల్లూ యేల్లూ పట్టుకోడం ... అని సూస్తన్నా."

సూరీడు మెడలోంచి మంగళసూత్రం తీసి ఇచ్చింది. పసుపు రంగు బంగారు తాడు సన్నటి పాములాగా ఫకీరు చేతిలోకి జారింది. ఫకీరు ఆప్యాయంగా గొలుసు తడుముకున్నాడు. బయటికి కదల బోయాడు.

"అదేటీ? అన్నం తినవా?"

"అలీసెమై పోతది. మనకి డబ్బు లేదంటాడు సామ్ముల్లు ఇచ్చేవోడు. కోపరేట్ బాంకుకు ఎల్లాలిగందా!" వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు ఫకీరు.

సూరీడు ఆ రోజే భర్తకు ఉత్తరం రాయించింది తాను రెండు మూడు రోజులలో వస్తున్నాననీ, అత్తయ్య ఆరోగ్యం జాగ్రత్తగా చూడ మనీను. ఉత్తరం అందుకుని వచ్చాడో, అందుకోకుండానే వచ్చాడో రాజు మూడో నాటికి దిగబడ్డాడు.

"మా అత్తగారికి బాగుండలేదని రాశాను. అయినా నువు లెక్క చేయలేదు. పద. అక్కడ ఒకదానికొకటి ఏవీ అమరడం లేదు." సూరీడు మీద కొట్ట బోయే వాడికి లాగా విరుచుకు పడ్డాడు.

సూరీడు బేలగా చూచింది. "మా అయ్య కట్టనం డబ్బుకోసం కోపరేట్‌లో అప్పు తీసుకుంటున్నడు. అది అందగానే బైలెల్లి వత్తాను" అంది.

"ఎప్పటి కొస్తది అప్పు?"

"ఈ మద్దినే..."

"నీ మెడ తాడేది?" పసుపుకొమ్ము వ్రేలితో అందుకున్నాడు రాజా.

"అప్పు కట్టాలంటే మరి కొంత కట్టాలంట."

రాజు కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి "అందుకని నీ తాడే దొరికిందా? నేను చచ్చా ననుకున్నావా?"

సూరీడు బేలగా తన మెడలోని పసుపుతాడు తడుముకుంది. రాజు కోపం పట్టలేక పోతున్నాడు. "బయల్దేరే!" అన్నాడు.

సీతాలు కలగజేసుకుంది.

"మా మామయ్య వత్తారు, బాబూ! డబ్బు వత్తదేమో, సూసి ఎల్లవోచ్చుగందా!" అంది సీతాలు.

"ఎవరు? ఫకీరుగారా? కూతురి మెడలో ఉన్న వస్తువు కూడా తీసుకెళ్ళిపోయిన ఫకీరా? తాడూ, కట్నం డబ్బూ తీసుకుని నా ఇంటికి రమ్మను" అని కొంతసేపు ఆగి, "తాగి రావద్దను" అన్నాడు.

అల్లుడి నోట ఇలా వినవలసి వస్తుందని సీతాలు ఊహించలేదు. సూరీడును వెంటబెట్టుకుని రాజు వెళ్ళిపోయాడు.

రాత్రి ఫకీరు వచ్చేటప్పటికి సీతాలు ఏడుస్తూ కూర్చుంది. ఫకీరు కడుపు నిండా తాగి వచ్చాడు.

"ఎందుకే ఏడుత్తవ్ ... నాను బతికే ఉన్నాను గందా!" నాలుక తడబడుతూంది ఫకీరుకు.

"అదే నా బాద— కూతురు సరుకు ఒట్టుకెల్లావు. అల్లుడు వచ్చాడు. సూరీడును నానా మాటలు అన్నడు. నీకేటి తెలుసు నా బాద. తాగొచ్చి మత్తులో ఉండిపోతున్నవు. పిల్లసరుకేది? కట్టనం సామ్మేది?" సీతాలు అతడిని పట్టుకుని ఏడుస్తోంది.

ఫకీరు చిరాకు పడ్డాడు. "ఉండే! ఎదవ సొద! అప్పు రావద్దా? నా గోల నాది. నీ గోల నీది."

"ఏం గోల నీది? అప్పు ఎప్పుడొత్తది. నిజెంగా నేనా?"

"అంటే ... ఏటే నీ ఏడుపు? కట్టుకున్నోణ్ణి నమ్మవా?"

"నమ్మను. అక్కడ సూరీడును ఏం బాదలు ఎడతన్నరో."

"సంపేత్తను నా కొడుకుని! దాన్నేటయినా అంటే..." ఫకీరు అటు పక్క తిరిగి పడుకున్నాడు. క్షణాలలో నిశ్చింతగా నిద్రకు పడ్డాడు.

ఆ రాత్రంతా సీతాలు ఏడుస్తూ కూర్చుంది. మధ్యలో కళ్ళు మూసినా సూరీడు కనిపించుతూ వచ్చింది.

సూరీడు చేతులు చాపి ఏడుస్తోంది. గుండె బాదుకుంటోంది.

"కట్నం సొమ్ము వద్దులే" అంటోంది "నా సరుకు తెచ్చి నా మొగాన కొట్టండి" అంటోంది.

నాలుగు రోజులూ సీతాలుకు నాలుగు యుగాలయింది. అయిదో నాడు సూరీడునుండి ఉత్తరం వచ్చింది. ప్రక్కింటి స్కూలు కుర్రాడిచేత రాయించింది సూరీడు. పోస్ట్ మన్ రెండు ముక్కలు చదివి వినిపించాడు.

"అమ్మా!

నాకు ఒంట్లో నీరసంగా ఉంది. నిన్ను చూడాలనుంది. సరుకూ, కట్నమూ పట్టుకురా.

—నీ సూరీడు."

సీతాలు గుండె బాదుకుంది.

"ఆ ఉత్తరం అమ్మాయి రాసింది కాదే" అన్నాడు ఫకీరు. తాగి లేడు.

"ఎలా సెప్పగలవు?"

"అమ్మాయి అయితే సరుకుకూ, కట్నం సొమ్ముకూ రాయదే."

"నా కూతురిని ఏం కష్టాలు పెడతన్నరో ... నువ్వేటి అలా మాటాడతవ్?"

ఫకీరు మాట్లాడలేదు.

"అప్పు మాటేంటి?"

"అప్పా?" తడబడ్డాడు ఫకీరు.

సీతాలు కనిపెట్టింది. "వోలమ్మో, తాడమ్ముకుని తాగేసావ్ ... నానేటి సేద్దును. కూతుర్ని పొట్ట నెట్టుకున్నవ్" శోకాలు ప్రారంభించింది.

ఫకీరు బయటికి వెళ్ళిపోయాడు. సూరీడు వద్ద నుండి టెలిగ్రాం వచ్చింది. సీతాలు ఇరుగింట్లో పొరుగింట్లో అప్పుచేసి ప్రయాణ మయింది. ఆమె ప్రయాణానికి సిద్ధమవుతోన్నంతసేపూ గొణుక్కుంటూనే ఉంది.

"సూరీడుకు ఒంట్లో నీరసంగా ఉందట. ఎలాగో ఏమయిందో ..."

ఆమెకు వాకిట్లోనే ఎదురయ్యాడు ఫకీరు.

"టెలిగ్గరాం కాయితం వొచ్చిందంట. నువు బయులెల్లి పోనావనుకున్నను" అన్నాడు ఫకీరు.

"రా! ఇద్దరం ఎల్దాం. అమ్మాయికి బావుండ లేదు." గొల్లుమంది సీతాలు.

"ఎందుకే ... నువ్వెల్లు. సరుకులు తెచ్చిన్ను కదా!"

సీతాలుకు చెవులలో అమృతం పోసినట్టుంది.

ఫకీరు ఆమె చేతిలో బంగారు తాడూ, చంద్రహారమూ ఉంచాడు. సీతాలు తన కళ్ళను తానే నమ్మలేకపోయింది.

"తాడు సరే ... చెంద్రారం ఎక్కడిది?" అంది.

"నగల కొట్లో అరువు తెచ్చి ... కోపరేటు అప్పు రానేదు గందా!"

"పోన్లే ... చంద్రారం అమ్ముకున్నా నాలుగేలు వత్తయ్యి."

"అందుకే నాను రాను. నువ్వెల్లి అల్లుడి సేతిలో పెట్టెయ్యి." ఫకీరు తల త్రిప్పుకున్నాడు.

అతడికీ పేమే. తాగుడుకు లోబడిపోండు. సీతాలు తృప్తిగా బస్సెక్కింది. వెళ్ళే ముందు వీరభద్రయ్యకు చెప్పింది.

ఫకీరు బరువు దిగినట్టుగా సారాకొట్టు వైపు చురుకుగా అడుగులు వేశాడు. వీరభద్రయ్య మందలించాడు. అయినా ఆగలేదు.

సీతాలుకు తెలియదు. అసలు తాడు అమ్మగా మిగిలిన సొమ్ముతోనే ఫకీరు సారాకొట్టు వైపు వెళ్ళాడని!

చంద్రహారం ఏమిటి? ఆమె కిచ్చిన బంగారం తాడూ దాని శతమానాలూ గిల్టువనీను.

కట్నం సొమ్ముకోసం, బంగారు తాడుకోసం అల్లుడు అన్ని టెలిగ్రాములూ ఉత్తరాలూ సూరీడు పేర రాశాడనీ.

క్రితం టెలిగ్రాం వచ్చేటప్పటికే అత్తగారి చేతిలోనూ, రాజు చేతిలోనూ సూరీడు చిత్ర హింసలు పడుతూ — చావుకోసం ఎదురుచూస్తున్న దనీనూ ...

అందుకే సీతాలు నిశ్చింతగా కిటికీలోంచి చూస్తోంది. గాలి తగులుతోంటే హాయిగా పరవశిస్తోంది. ★